క్లుప్తంగా

అవార్డు గ్రహీతకు సన్మానం


కాపు కృష్ణను సన్మానిస్తున్న నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): ఇటీవల ప్రభుత్వం నుంచి శ్రమశక్తి అవార్డు స్వీకరించిన టీబీజీకేఎస్ నాయకుడు కాపు కృష్ణను బీఆర్ఎస్ నాయకులు ఆదివారం సన్మానించారు. రామవరంలో ఆయనను సన్మానించాక వారు కార్మికుల సంక్షేమానికి కృష్ణ చేస్తున్న సేవలను కొనియాడారు. నాయకులు ఎం.డీ.గౌస్, దొమ్మేటి నాగేశ్వరరావు, మజీద్, రాజేందర్, ఆవునూరి చంద్రయ్య, కొయ్యాడ శ్రీను, పురుషోత్తం, అరుణ్, రాజు, పూర్ణ, రవి, దేవేందర్, కేశవ్, సాగర్, అవినాస్, రాజు, కృష్ణ, రాజు పాల్గొన్నారు.

ఉచిత బీమాను సద్వినియోగం చేసుకోండి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో కార్మికులందరూ ఉచిత ప్రమాద బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీబీజీకేఎస్ నాయకుడు ఎండీ రజాక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ కార్మికుడు బ్యాంకు అకౌంట్‌ను కార్పొరేట్ శాలరీ అకౌంట్‌లోకి మార్చుకోవడం ద్వారా రూ.40 లక్షల నుంచి రూ.62 లక్షల మేర బీమా వర్తిస్తుందని పేర్కొన్నారు. ఇందుకు ప్రీమియం చెల్లించాల్సిన పని లేదని, సంస్థే చెల్లిస్తుందని తెలిపారు.

సేంద్రియ ఎరువులను వినియోగించాలి

పాల్వంచరూరల్: రసాయన ఎరువులను వాడకుండా సేంద్రియ ఎరువులను వినియోగించుకోవాలని అన్నపూర్ణ గోసంరక్షణ సమితి ప్రధాన కార్యదర్శి ఆంజనేయశర్మ అన్నారు. స్థానికంగా సమితికి చెందిన గోశాలకు కేటీపీఎస్ ఉద్యోగులు, రూ.5లక్షల విలువైన గోబర్ డీవాటరింగ్, లాగ్‌మేకింగ్ యంత్రాలను వితరణ చేశారు. ఈ యంత్రాలను ఆదివారం 6వ బెటాలియన్ కమాండెంట్ శివప్రసాదరెడ్డి, అడిషనల్ కమాండెంట్ శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేటీపీఎస్ డీఈ ఎంవీఎల్ఎన్ రవికుమార్‌ను శాలువలతో సత్కరించారు. అనంతరం శర్మ మాట్లాడారు. వ్యవసాయంలో రైతులు రసాయన ఎరువులను వాడకుండా సేంద్రియ ఎరువులను వినియోగించుకుంటే మంచి ఫలితాలను సాధించవచ్చన్నారు. పెరటి, మిద్దె తోటలలో కూడా కూరగాయలకు వీటిని వాడుకోవచ్చన్నారు. వివరాలకు 939514855 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ముగిసిన శ్రీ పెద్దమ్మ తల్లి జాతర

జూలూరుపాడు: మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో శ్రీపెద్దమ్మతల్లి జాతర ఆదివారం ముగిసింది. ఆదివాసీ గిరిజనుల కులదైవమైన శ్రీపెద్దమ్మ తల్లి జాతర చివరి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శనివారం సరువుల ఊరేగింపు జరగగా, ఆదివారం శ్రీపెద్దమతల్లి ఆలయానికి ఎదురుగా ఏర్పాటు చేసిన నిప్పులగుండంలో ఆదివాసీ పూజారులు, భక్తులు ఉత్సవ మూర్తులను ఎత్తుకొని నడిచి తమ భక్తిని చాటుకున్నారు. అనంతరం ఆదివాసీ మహిళలు, ఆడపడుచులు శ్రీపెద్దమ్మతల్లికి బోనాలు సమర్పించడంతో జాతర ముగిసింది.

ఎన్డీ ఆధ్వర్యంలో 'అల్లూరి' వర్ధంతి

జూలూరుపాడు: మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజు 99వ వర్ధంతి సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం గుండ్లరేవు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మా ఆ పార్టీ జెండాను ఆవిష్కరించి, స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజుకు నివాళులర్పించారు. కార్యక్రమంలో తాటి నరసింహారావు, తెల్లం కృష్ణయ్య, మల్కం వెంకటేశ్వర్లు, సుశీల, వర్సా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్మశానం కనుమరుగు

- సమాధులకు స్థలం కరువు
- దశాబ్దాల కాలంగా కోరుతున్న జేఏసీ నాయకులు
- ఆనవాళ్లను తుడిచేస్తున్న మున్సిపాలిటీ సిబ్బంది


శ్రీనివాస కాలనీ డంపింగ్ యార్డ్‌లో మునిగిపోతున్న సమాధులు

పాల్వంచ: పాల్వంచ మున్సిపాలిటీ, మండల వ్యాప్తంగా ఉన్న క్రైస్తవులకు ప్రత్యేకంగా సమాధుల స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు. ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని అన్ని క్రైస్తవ మిషనరీల, చర్చిల నిర్వాహకులు ప్రభుత్వాన్ని దశాబ్దాల కాలంగా కోరుతున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలు సమర్పిస్తున్నా అమలు జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చనిపోయిన వారిని ప్రస్తుతం శ్రీనివాస కాలనీ గుట్ట దగ్గర పెడుతున్నారు. కాగా అక్కడే మున్సిపాలిటీలో సేకరించిన చెత్తను నిత్యం ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ చేస్తున్నారు. చెత్త భారీగా పెరిగిన సమయంలో జేసీబీలతో నెట్టి వేస్తున్నారు. దీంతో ఇప్పటికే వందలాది సమాధుల ఆనవాళ్లు కూడా లేకుండా పోయాయి. అంతేకాకుండా ఆ ప్రాంతమంతా దుర్గంధం వెదజల్లుతుండడంతో ఆ ప్రదేశంలో అంత్యక్రియలు చేసేందుకు వెళ్లే వారు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

దెబ్బతింటున్న మనోభావాలు..

కొన్ని సంవత్సరాల నుంచి గుట్ట పక్కన సమాధులు పెడుతున్నారు. సుమారు 20వేల మంది క్రైస్తవులు ఉన్న పాల్వంచలో సమాధులకు స్థలం లేదు. ఎవరైనా ఆకస్మాత్తుగా చనిపోతే వారికి ఎక్కడ సమాధి చేయాలనే ఆందోళన వ్యక్తమవుతుంది. ప్రత్యేక స్థలం కోసం ఇప్పటికే పలువురు కలెక్టర్లు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లారు. బసవతారక కాలనీ సమీపంలో ఫారెస్ట్ స్థలం పక్కన కొంత భూమిని సమాధులకు కేటాయిస్తామని ప్రయత్నించినా అది అమలు కావడం లేదు. ఇటీవల ఓ పాస్టర్ చనిపోతే అతనిని సమాధి చేయడానికి స్థలం కోసం అనేక ఇబ్బంది పడ్డామని స్థానికులు వాపోతున్నారు. అక్కడ ఇప్పటికే ఉన్న సమాధుల చెత్త డంప్‌లో కలిసి పోవడంతో సమాధుల పండుగ, ప్రతి ఏటా స్మరించుకునేందుకు కనీసం సమాధి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు మానసిక బాధకు లోనవుతున్నారు. ఇప్పటికైనా స్థలం కేటాయించాలని క్రైస్తవులు డిమాండ్ చేస్తున్నారు.

ఎవరూ పట్టించుకోవడం లేదు



క్రైస్తవుల సమాధుల కోసం స్థలం కేటాయించాలని రెండు దశాబ్దాలుగా అధికారులు, ప్రజా ప్రతినిధులను కలిసి కోరుతున్నాం. అయినా పట్టించుకోక పోవడంతో ఎవరైనా క్రైస్తవులు చనిపోతే వారిని సమాధి చేసేందుకు ఇబ్బంది పడుతున్నాం. ఇప్పటికైనా స్థలం కేటాయించాలని కోరుతున్నాం.
– నల్లగట్ల ప్రేమ్‌దాస్, పాస్టర్ ఫెలోషిప్ జిల్లా అధ్యక్షుడు

అధికారులు స్పందించాలి



క్రైస్తవులు ఎవరైనా చనిపోతే డంపింగ్ యార్డ్ ప్రక్కన పెడుతున్నారు. అక్కడ ఇప్పుడు స్థలం కొరత ఉంది. జేసీబీలతో చెత్తను సమాధులపైకి నెట్టి వేస్తుండటంతో సమాధుల ఆనవాళ్లు కనుమరుగు అవుతున్నాయి. గతంలో రెండు ఎకరాలు స్థలం కేటాయించేందుకు అధికారులు పరిశీలించారు. కానీ అది ఇప్పటికీ పెండింగ్‌లో ఉంది.
– జాన్ విల్సన్, పాస్టర్స్ ఫెలోషిప్ జేఏసీ అధ్యక్షుడు

పాలకులతో ప్రజలకు ఇబ్బందులు


మాట్లాడుతున్న పోట్ల నాగేశ్వరరావు

పాల్వంచరూరల్: కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాల పాలకులు అనుసరిస్తున్న విధానాలు, పన్నుల భారం కారణంగా నేడు సామాన్య, మధ్య తరగతి ప్రజలు దుర్భర పరిస్థితులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్సీ, టీపీసీసీ ఉపాధ్యక్షుడు పోట్ల నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. దంతలబోరు ఎస్సీకాలనీలో మండల అధ్యక్షులు గద్దల రమేష్ అధ్యక్షతన ఆదివారం కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. మాట్లాడుతూ... బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎన్నికల హామీలను విస్మరించి నేడు ప్రజలపై ఇష్టారాజ్యంగా పన్నుల భారం మోపుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తొమ్మిది రకాల నిత్యావసరాలతో రేషన్ ఇచ్చి పేదల కడుపు నింపేదన్నారు. రానున్న ఎన్నికల్లో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించుకోవాలని కోరారు. సమావేశంలో గద్ద రాజశేఖర్, అజ్మీర సురేష్‌నాయక్, బట్టు మురళీనాయక్ పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి


రెడ్డిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పాల్వంచరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని కాంటాలు పెట్టి వెంటనే తరలించాలని, అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల విశ్వనాథం డిమాండ్ చేశారు. రెడ్డిగూడెంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం సీపీఐ, ఏఐకేఎస్ నాయకుల బృందం సందర్శించింది. రైతులను కలుసుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముత్యాల విశ్వనాథం మాట్లాడారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించడం హర్షణీయం అన్నారు. అయితే క్షేత్రస్థాయిలో కొనుగోలు కేంద్రాల వద్ద పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. తేమశాతం పేరుతో అధికారులు ధాన్యాన్ని ఆరబెట్టుకుని తీసుకరావాలని నిబంధనలు విధించడంతో రైతులు దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నట్లు చెప్పారు. తరచూ అకాల వర్షాలు కురవడంతో రైతులు ధాన్యాన్ని ఆరబెట్టే పరిస్థితి లేదన్నారు. లక్షల ఎకరాల్లో పండించిన పంట కొనుగోలు కేంద్రాల్లో నిల్వలు ఉన్నాయని తెలిపారు. అకాల వర్షాలకు మిర్చి, మామిడి రైతులు కూడా నష్టపోయినట్లు తెలిపారు. ప్రభుత్వం స్పందించి వెంటనే కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం నిల్వలను కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, పంట నష్టంపై సర్వే పూర్తి చేసి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, కోటి నాగేశ్వరరావు, రామచందర్, ఉపేందర్‌రెడ్డి, గుడిపూడి రాజు, జకరయ్య, నిమ్మల మోహన్‌రెడ్డి, జక్కుల కృష్ణ, రాములు, వెంకటరెడ్డి, వేల్పుల లింగయ్య, సత్తిరెడ్డి, మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిని కాపాడుకుందాం..


మాట్లాడుతున్న మందా నర్సింహారావు

ఇల్లెందు: సింగరేణి పుట్టినిల్లు ఇల్లెందును కాపాడుకోవాలని, సింగరేణిని ప్రైవేట్‌పరం కాకుండా పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందా నర్సింహరావు కార్మికులకు పిలుపునిచ్చారు. ఆదివారం జేకే ఓసీలో జరిగిన ఫిట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ఇల్లెందులో వేలాది మంది కార్మికులతో కళకళలాడిన కార్మికవాడలు పాలకుల నిర్లక్ష్యం వల్ల బోసిపోయిందన్నారు. కేంద్రప్రభుత్వం బొగ్గు బావులను ప్రైవేట్ పరం చేస్తుంటే రాష్ట్రంలో బొగ్గు గ్రేడింగ్ తక్కువ ఉందని ప్రైవేట్‌కు అప్పగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. మోదీ ప్రభుత్వం కార్మికుల త్యాగాలతో సాధించుకున్న కార్మిక చట్టాలను సవరించి నాలుగు కోడ్‌లను తెచ్చారని విమర్శించారు. మేడేను కూడా రద్దు చేసి విశ్వకర్మ జయంతిని జరపాలని చూడటం దుర్మార్గమన్నారు. లాభాల్లో ఉన్న సంస్థను నష్టాల్లో నెట్టిందని ఆరోపించారు. సింగరేణి సంస్థకు విద్యుత్ శాఖ నుంచి రావాల్సిన బకాయిలను ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అబ్దుల్ నబీ, తాళ్లూరి కృష్ణ, అబ్బాస్, శంకర్, కోసూరి రమేష్, చందర్, రాందాస్, సదానందం, మోహన్‌రావు, కార్మికులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు బస్‌పాస్ మేళా

సుజాతనగర్: సుజాతనగర్ మండలంలోని గ్రామాల్లో 9,10వ తేదీల్లో ఆయా పంచాయతీ ఆఫీస్ వద్ద దివ్యాంగులకు ఆర్‌టీసీ బస్‌పాస్‌లు అందజేయనున్నట్లు ఆదివారం కొత్తగూడెం డిపో మేనేజర్ వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి పంచాయతీ ఆఫీస్‌లో పాస్‌లు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. సదరన్ సర్టిఫికెట్ జిరాక్స్, ఆధార్‌కార్డు, ఒక పాస్ ఫోటో, ఫీజు రూ.50 చెల్లించాలని పేర్కొన్నారు.

భారీ వృక్షం తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

పాల్వంచరూరల్: మండల పరిధి ఉల్వనూరు బంజర గ్రామపంచాయతీలోని కుంజ వెంకయ్యగుంపు గ్రామంలోని ప్రధాన వీధిలో భారీ వృక్షం ఎండిపోయి కూలిపోయే పరిస్థితిలో ప్రమాదకరంగా ఉంది. స్థానికులు పలుమార్లు అధికారులకు, సర్పంచ్‌కు విన్నవించుకున్నా పట్టించుకోలేదు. దీనిపై ఈనెల 3వ తేదిన సాక్షి దినపత్రికలో అటెన్షన్ ప్లీజ్ శీర్షికలో 'ప్రమాదకరంగా మోడుబారిన చెట్టు 'అనే వార్తా కథనం ప్రచురితం అయింది. స్పందించిన కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఎంపీఓను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఎంపీఓ కూలీలతో చెట్టును తొలగించారు. స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఇల్లెందురూరల్: రేపల్లెవాడ గ్రామపంచాయతీ నిజాంపేట గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. వివరాలు.. కొమ్ముగూడెం గ్రామానికి చెందిన రాఘవేంద్రరావు బైక్‌పై చల్లసముద్రం నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. నిజాంపేట గ్రామం వద్ద ఎదురుగా వచ్చిన బైక్‌ను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. రాఘవేంద్రరావు తీవ్రంగా గాయపడగా మరో ఇద్దరికి స్వల్పంగా గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వచ్చిన బీఆర్ఎస్ నేత బానోత్ హరిసింగ్ నాయక్ గాయపడిన రాఘవేంద్రరావును ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండటంతో కొత్తగూడెంకు సిఫారసు చేశారు.

ప్రజానాట్యమండలి నేతకు నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

ఇల్లెందు: సీపీఐ, ప్రజానాట్యమండలి జిల్లా నేత బల్లాల మనోహర్(75) మరణం పార్టీకి ప్రజా సంఘాలకు తీరని లోటని సీపీఐ నియోజకవర్గ కన్వీనర్ కె.సారయ్య అన్నారు. 24 ఏరియాకు చెందిన మనోహర్ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. సమాచారం అందుకున్న సీపీఐ నేతలు ఆయన మృతదేహాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మనోహర్ సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో బంధం నాగయ్య, ఉడుత ఐలయ్య, రవీందర్, గణపతి, శంషుద్దీన్, సూర్యప్రకాష్, ఆదినారాయణ, ఈర్ల రవి, సత్యనారాయణ, శ్రీనివాస్, యాదగిరి, మోజేష్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో బీఎస్పీ మార్క్ చూపిస్తాం..


కొత్తగూడెంఅర్బన్: పట్టణంలో ప్రదర్శన నిర్వహిస్తున్న బీఎస్పీ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణలో బహుజన్ సమాజ్ పార్టీ ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తుందని ఇక తాడోపేడో తేల్చుకుంటామని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం నుంచి తెలంగాణ భరోసా సభకు హైదరాబాద్ బయలుదేరుతున్న సందర్భంగా పార్టీ జెండాను ఊపి ర్యాలీ ప్రారంభించారు. మాట్లాడుతూ.. తెలంగాణలో రాజ్యాధికారం దిశగా బీఎస్పీ ఆలోచనలు చేస్తుందన్నారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ముఖ్యఅతిథిగా జరిగే తెలంగాణ భరోసా మహాసభతో బీఎస్పీ పూర్తిస్థాయిలో రానున్న ఎన్నికలకు సర్వం సిద్ధం అవుతుందన్నారు. ఈసారి తెలంగాణలో జరిగే ఎన్నికల్లో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు అగ్రవర్ణ పేదలను అక్కున చేర్చుకునే విధంగా ముందుకు సాగుతామని వివరించారు. సాయి, తాళ్లూరి హరిబాబు, నాగుల రవికుమార్, కోలా మల్లిక, బండి రమణి, కోళ్లపూడి ప్రవీణ్ కుమార్, కేతిని కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: కొమరారం గ్రామంలో బీఎస్పీ కార్యకర్తలు ఆదివారం ప్రదర్శన నిర్వహించారు. హైదరాబాద్‌లో బీఎస్పీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తెలంగాణ భరోసా సభకు బయలుదేరే ముందు గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు కాంపాటి నరేష్, లాజర్, యనగంటి సంపత్ మాట్లాడుతూ.. బడుగులకు రాజ్యాధికారం లక్ష్యంగా బీఎస్పీ పోరాడుతోందని గుర్తుచేశారు.

ఇల్లెందు/టేకులపల్లి: తెలంగాణ భరోసా సభను విజయవంతం చేసేందుకు ఇల్లెందు నుంచి బీఎస్పీ నియోజకవర్గ కోఆర్డినేటర్ బాదావత్ ప్రతాప్ ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు హైదరాబాద్ తరలివెళ్లారు. ఆదివారం ఇల్లెందు పట్టణంలోని కొత్త బస్టాండ్ సెంటర్ నుంచి ర్యాలీగా బయలు దేరి పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు. నాయకులు ఎవరి వంటలు వారే వండుకుని, భోజన బాక్సులు తీసుకుని హంగూ, ఆర్భాటాలు లేకుండా సొంత ఖర్చులతో హైదరాబాద్‌కు వెళ్లారు. రాంబాబు, రాంప్రసాద్, తులసమ్మ, సుజాత, లావణ్య, లోకేష్, రాకేష్, తరుణ్, అరుణ్, కిరణ్, యశ్వంత్ ఉన్నారు.

వేసవి క్రీడా శిక్షణ శిబిరం ప్రారంభం


క్రీడాకారులు, కోచ్‌లతో సింగరేణి ఏరియా జీఎం షాలేమురాజు

ఇల్లెందు: సింగరేణి ఇల్లెందు ఏరియా ఉద్యోగులకు 'వర్క్ పీపుల్స్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అసోసియేషన్ 'ఆధ్వర్యంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఏరియా జీఎం షాలేమురాజు ప్రారంభించారు. ఆదివారం 24 ఏరియా గ్రౌండ్‌లో బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జీఎం షాలేమురాజు మాట్లాడుతూ.. సింగరేణిలో పని చేస్తున్న ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని వారి పిల్లలకు ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్‌లో శిక్షణ ఇప్పించటం ద్వారా ఎంతో ఉపయోగం ఉంటుందన్నారు. పిల్లలకు శారీరక, మానసికోల్లాసం ఉంటుందన్నారు. పిల్లలు చిన్నతనం నుంచే క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకోవాలని, వేసవి సెలవుల్లో క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. శిక్షకులు సూచించిన మెలకువలు పాటించాలని కోరారు. 25 రోజుల పాటు సాగే ఈ క్రీడా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, అధికారుల సంఘం అధ్యక్షుడు పంజాల శ్రీనివాసు, జేకేఓసీ పీఓ బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, డీవైపీఎం పర్సనల్ శ్రీహరి, గుర్తింపు ఎస్.రంగనాథ్, జైనుల్లా వుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కిందిస్థాయి ఉద్యోగులపై వివక్ష


ఇల్లెందురూరల్: దీక్షలో కూర్చున్న వీఓఏలు

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు ఉద్యమిస్తామని వీఓఏల సంఘం నాయకులు స్పష్టం చేశారు. మండలంలోని సెర్ప్ కార్యాలయం ఎదుట వీఓఏలు చేపట్టిన నిరవధిక దీక్ష ఆదివారం 21వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. ఒకే శాఖలో పనిచేస్తున్నప్పటికీ ప్రభుత్వం కిందిస్థాయి ఉద్యోగుల పట్ల వివక్ష చూపుతోందని ఆరోపించారు. పొదుపు సంఘాల ఆవిర్భావం నుంచి సేవలందిస్తున్న తమను విస్మరించి సెర్ప్‌లో అధికారి స్థాయి వారికి మాత్రమే వేతనాలు పెంచి తమను చిన్నచూపు చూడటం సరికాదన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించని పక్షంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సుల్తానా, నవ్య, ప్రమీల, పాపారావు, మోతీలాల్, వసంతరావు, లత, రజిత, వసంత, సునిత, సురేష్, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

టేకులపల్లి: ఐకేపీ వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో తెలంగాణ ఐకేపీ వీఓఏ ఉద్యోగుల సంఘం (సీఐటీయూ) ఆధ్వర్యంలో ప్రారంభమైన వీఓఏల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ మేరకు ఆదివారం సమ్మె 21వ రోజుకు చేరింది. గౌరవ వేతనం మాకొద్దని, కనీస వేతనం, ఉద్యోగ భద్రత కావాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం మండల కేంద్రంలో ప్రజా సంఘాలు, గ్రామ సంఘాల లీడర్లతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో చంద్రకళ, మూడ్ చరణ్, గౌసియా, జయ, నాగమణి, స్వప్న, కావేరి, శిరోమణి, మంగీలాల్ తదితరులు పాల్గొన్నారు.

పరిష్కారమయ్యే వరకు విశ్రమించేది లేదు..


టేకులపల్లి: సమ్మెలో పాల్గొన్న జేపీఎస్‌లు

టేకులపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరీ కాలం పూర్తయినప్పటికీ రెగ్యులర్ చేయడం లేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలని కోరుతూ గత నెల 28 నుంచి కలెక్టరేట్ వద్ద నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె కొనసాగుతోంది. టేకులపల్లి మండలంలో మొత్తం 36 మందికి గాను 30 మంది జేపీఎస్‌లు ప్రతిరోజూ సమ్మెలో పాల్గొంటూ నిరసన తెలియజేస్తున్నారు. 10 రోజుల నుంచి కార్యదర్శులు విధుల్లో లేకపోవడంతో మండలంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేశారు. జేపీఎస్‌ల సమ్మెకు సర్పంచ్‌లు కూడా మద్దతు ప్రకటించారు. తమ హక్కుల సాధన కోసం కార్యదర్శులు పిల్లలతో సహా జిల్లా కేంద్రానికి వెళ్లి సమ్మెలో పాల్గొంటున్నారు. తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారం అయ్యేంత వరకూ సమ్మె విరమించేది లేదని కార్యదర్శులు స్పష్టం చేస్తున్నారు.

చుంచుపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మెలో భాగంగా పదో రోజు ఆదివారం హరిత వినతి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సీఎంకు ఎంతో ప్రీతి పాత్రమైన హరిత హారం లక్ష్యాన్ని నెరవేర్చి మొక్కలను నాటి అడవులను పెంచటంలో ఎంతో క్రియాశీలకంగా పనిచేసిన జేపీఎస్‌లను రెగ్యులర్ చేయాలని కోరుతూ కలెక్టరేట్ ఆవరణలోని మొక్కలకు వినతిపత్రాలు కట్టి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణ, సభ్యులు సతీష్, చరిత్, సాయి, కిరణ్, నర్మద, రణధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

పాల్వంచరూరల్: పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చెయనున్నట్లు బంద్రుగొండ సర్పంచ్ పద్మ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.3 వడ్డీలకు తెచ్చి మూడేళ్లుగా పంచాయతీలో అభివృద్ధి పనులకు ఖర్చు చేసినా నేటికీ బిల్లులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని పేర్కొన్నారు. మండలాధికారులు, పంచాయతీ కార్యదర్శి విధానాల వలన తమ కుటుంబం బజారున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం


ఇల్లెందురూరల్: ధ్వజస్తంభానికి పూజ చేస్తున్న గ్రామస్తులు


సుజాతనగర్: బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న ఎడవల్లి కృష్ణ

సుజాతనగర్: గరిబ్ పేట, లక్ష్మీదేవిపల్లిలోని శ్రీ ఆంజనేయ స్వామి, ధ్వజస్తంభం, ముత్యాలమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠా మహోత్సవ కార్యక్రమాలు ఆదివారం ఘనంగా జరిగాయి. టీపీసీసీ జనరల్ సెక్రెటరీ ఎడవల్లి కృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద వెంకన్న, లక్ష్మీనారాయణ, కోటేష్ నాయక్, వెంకన్న, గడ్డిగుడ్డ నరేష్, భూక్యా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. శ్రీఆంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు కేవీ రంగాకిరణ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూకా రాజేష్ నాయక్, బానోతు లక్ష్మణ్, కున్సోత్ ధర్మ, చింతలచెర్వు శ్రీనివాసరావు, జల్లారపు శ్రీనివాస్, సాయి కిరణ్, శ్రీను, కుమార్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: కొమరారం గ్రామంలోని కోదండ రామాలయం వద్ద ధ్వజస్తంభ ప్రతిష్ఠా మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా నిర్మించిన యాగశాలలో మూడు రోజులపాటు హోమం నిర్వహించారు. రాతితో ప్రత్యేకంగా తయారు చేయించిన ధ్వజస్తంభాన్ని గ్రామంలోకి శోభయాత్రతో తరలించారు. ఆదివారం వేదమంత్రోచ్చారణలతో ప్రత్యేకంగా జలాభిషేకం చేసి పూజలు చేశారు. అనంతరం వేద పండితుల ఆధ్వర్యంలో ప్రతిష్ఠించారు. అనంతరం అన్నదానం చేశారు. గ్రామంలోని నాభిశిల వద్ద ప్రత్యేక పూజ చేసి, గ్రామస్తులు తమ ఇంటి నుంచి ప్రత్యేకంగా బోనాలు సిద్ధం చేసి ముత్యాలమ్మకు సమర్పించారు.



అటెన్షన్ ప్లీజ్

వీధి కుక్కలపై పట్టింపేది?

సుజాతనగర్ మండల వ్యాప్తంగా వీధి కుక్కల సంతతి పెరగడంతో ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు. కుక్కలు వీధుల్లో సంచరిస్తూ కనపడిన వారిపై దాడులకు దిగుతున్నాయి. ద్విచక్రవాహనాలపై వెళ్లే వారిని వెంబడిస్తూ పట్టిపీకుతున్నాయి. కుక్కలను దూర ప్రాంతాలకు తరలించాలని స్థానికులు కోరుతున్నారు. – సుజాతనగర్



ప్రశ్నించాల్సిన అధికారి : టి.వెంకటలక్ష్మి, ఎంపీడీఓ, సుజాతనగర్
సెల్ నెంబర్ 6303023384